క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఇచ్చోడ: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని ఇచ్చోడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ, జాతర్ల, బోస్రా గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన విద్య వ్యవస్థతో పాటు వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక తరగతులతో పాటుగా, పోటీ పరీక్షల కోసం క్లాసులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు., విద్యార్థుల తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. అధ్యాపకులు మురళి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆదిలాబాద్‌టౌన్: వయోవృద్ధులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా నిత్యం ధ్యానం, యోగా, వాకింగ్ చేయాలని వయోవృద్ధుల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. ఆదివారం వయోవృద్ధుల కార్యాలయంలో మధుమేహంపై అవగాహన కల్పించారు. మధుమేహం ఎలా వస్తుంది, ఎలా నివారించాలని, పరీక్షలు ఏవిధంగా చేయాలనే అంశాల గురించి వివరించారు. అనంతరం నషా ముక్త్ భారత్ పేరిట జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వయోవృద్ధుల సమైఖ్య కార్యదర్శి కులకర్ని, లక్ష్మారెడ్డి, వామన్‌రావు, హన్మంత్ రెడ్డి, గంగాధర్, సాయి కిరణ్, పోశెట్టి, దేవేంద్ర పాల్గొన్నారు.

బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



పూజలు చేస్తున్న సభ్యులు

బోథ్: బోథ్ పట్టణంలో ఆషాఢ మాసంలో బోనాలను ఘనంగా నిర్వహిస్తామని కొట్టాల పోచమ్మ ఆలయ అధ్యక్షుడు కొట్టాల రమేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొట్టాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. వచ్చే నెల 13న గ్రామంలో ఉన్న ప్రతీ కుటుంబం బోనాల పండుగలో పాల్గొనాలని కోరారు. అనంతరం పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యులను నియమించాలి

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బదిలీల్లో బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్‌ను బదిలీ చేయడంతో ఆ స్థానంలో మరొక వైద్యుడు నియమితులైన ఆయన దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఖాళీ ఏర్పడింది. ప్రస్తుతం ఇద్దరు వైద్యులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇది వరకు సూపరింటెండెంట్‌గా ఉన్న రవీంద్రప్రసాద్‌ను బోథ్‌లోనే కొనసాగించాలని, మరింత మంది వైద్యులను నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పంచాయతీరాజ్ సంఘటన్ సమావేశంలో ఆడే గజేందర్

నేరడిగొండ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ స్టేట్ ఎక్జిక్యూటివ్ మీటింగ్‌లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సిరికొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్, పోతన్న, గజ్జెల అశోక్ పాల్గొన్నారు.

అగ్నివీర్ అభ్యర్థులకు మాక్‌టెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం అగ్నివీర్ అభ్యర్థులకు మాక్‌టెస్ట్ నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ సాయిసుప్రియ ఆస్పత్రి వైద్యులు రజనీకాంత్, సోల్జర్ గ్రూప్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు 168 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈనెల 30న నుంచి అగ్నివీర్ అభ్యర్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో మాక్ టెస్ట్ నిర్వహించినట్లు వెల్లడించారు.

క్షణ క్షణం.. భయం భయం

- శిథిలావస్థలో మావల కేజీబీవీ
- వసతులు లేక ఇబ్బందులు
- భవనం లేక పరేషాన్
- విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రుల వెనుకంజ



మావల కేజీబీవీ



విద్యార్థులు రాక ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: ఏ క్షణం ఏమవుతుందోనని విద్యార్థులు క్షణ క్షణం భయాందోళనకు గురవుతూ గతేడాది విద్యాబోధన చేశారు. విద్యార్థుల కోసం భవనం వెతకాల్సిన అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో ఇంకా తరగతులు ప్రారంభం కాలేదు. పాఠశాలలు ప్రారంభమై పది రోజులు అవుతున్నా.. ఆ భవనాన్ని చూసి విద్యార్థులు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు ప్రతిరోజు కేజీబీవీకి వచ్చి కాలక్షేపం చేస్తూ వెనుదిరుగుతున్నారు. ఇదంతా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల వసతిగృహంలో తాత్కాలికంగా ఉన్న మావల కేజీబీవీ దుస్థితి. తీరా ఇప్పుడు అధికారులు అద్దె భవనం కోసం వెతకడం వారి పని తీరుకు అద్దం పడుతుంది. ఉన్న భవనంలోనే ఈ ఏడాది కొనసాగిస్తారా? లేక అద్దె భవనంలో తరగతులు ప్రారంభిస్తారా? తెలియక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

శిథిలావస్థలో గదులు..

మావల కేజీబీవీని ప్రభుత్వం 2023లో నూతనంగా ప్రకటించింది. 2024 సంవత్సరంలో 6, 7 తరగతులు ప్రారంభించింది. ఆయేడు భీంపూర్ కేజీబీవీలోనే ఆ విద్యార్థులకు తరగతులు బోధించారు. సెప్టెంబర్‌లో మావల కేజీబీవీని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక అధికారితో పాటు 10 మంది ఉపాధ్యాయులను నియమించారు. గతేడాది కేవలం 21 మంది విద్యార్థులతో విద్యాబోధన జరిగింది. డైట్ వసతిగృహంలో వీరి కోసం రెండు తరగతి గదులు, ఒక ఆఫీస్ రూమ్, రెండు వంట గదులను కేటాయించారు. ఇవి కూడా ఇరుకు గదులే. కనీసం ఐదారు పిల్లలు కూర్చునే పరిస్థితి లేదు. వర్షం కురిసిందంటే పైకప్పు ఊరుస్తుంది. ఏ క్షణం ఏమవుతుందోనని విద్యార్థులు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ చదువుకున్నారు. రాత్రి వేళల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న డైట్ కళాశాల ప్రాంగణంలోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో భీంపూర్ కేజీబీవీలో నిద్రించారు. అయితే ఈఏడాది భీంపూర్ కేజీబీవీ బిల్డింగ్ పూర్తి కావడంతో భీంపూర్‌కు వెళ్లిపోతున్నారు. ఆ భవనాన్ని విద్యాశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రారంభం కాని తరగతులు..

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. అయితే ఇంతవరకు మావల కేజీబీవీ తరగతులు ప్రారంభం కాలేదు. ఈఏడాది 6,7,8 తరగతుల్లో అడ్మిషన్లు తీసుకున్నారు. 120 మంది విద్యార్థులు ఈ కేజీబీవీలో చేరారు. భవనం లేకపోవడంతో కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయులు ప్రతిరోజు వస్తూ కాలక్షేపం చేసి ఇంటిముఖం పడుతున్నారు. అయితే ప్రస్తుతం భీంపూర్ కేజీబీవీ కొనసాగుతున్న భవనం కేటాయిస్తారా? ప్రత్యమ్నాయంగా మరే భవనాన్ని చూస్తారా? లేక ఈ శిథిలావస్థ గదిలోనే విద్యార్థులకు తరగతులు కొనసాగిస్తారనేది సందిగ్ధం నెలకొంది.

భవనం కోసం పరిశీలిస్తున్నాం..



మావల కేజీబీవీ కోసం అద్దె భవనం చూస్తున్నాం. ప్రస్తుతం భీంపూర్ కేజీబీవీ కొనసాగుతున్న భవనంలో దసరా వరకు పాఠాలు నిర్వహించేలా జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చారు. భీంపూర్ కేజీబీవీని రెండు మూడు రోజుల్లో అక్కడికి మార్చుతాం. దసరా వరకు మావల కేజీబీవీకి సంబంధించి నూతన భవనాన్ని ఎంపిక చేసి తరగతులు జరిగేలా చూస్తాం.

– ఉదయశ్రీ, సెక్టోరియల్ అధికారి

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రమేశ్, ఆనంద్‌రెడ్డి

తలమడుగు: మండల కేంద్రంలో కాటిపెల్లి సాయ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుటుంబసభ్యులు సహకారంతో ఆదివారం ప్రజా గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ సూపరింటెండెంట్ కాటిపెల్లి ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ విజ్ఞానం పంచాలనే సంకల్పంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు సరైన పుస్తకాలు లేక పోటీ పరీక్షల్లో రాణించలేకపోతున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆనంద్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రమేశ్, గ్రామస్తులు శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, గంగన్న, రామన్న, మనోహర్ రావు, ఇస్తారి, రాకేశ్, రమాకాంత్, రవికాంత్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తాంసి: సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రమేశ్, సహాయ కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా బుర్రి సట్వాజీ, తాంసి కార్యదర్శిగా రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్, అశోక్, కుంటాల రాములు, ఆశారెడ్డి పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌ను పట్టించుకోని ప్రభుత్వాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేసులు, కాసులు గురించి ఆలోచించడమే తప్పా యువత భవిష్యత్ గురించి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదిలాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఐటీ టవర్ విద్యార్థుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, శివకుమార్, గణేష్, సతీష్, రాజు, స్వామి, కపిల్, దయాకర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మతాలకతీతంగా మొహర్రం జరుపుకోవాలి



సమవేశమైన గ్రామస్తులు

జైనథ్: మతాలకతీతంగా మొహర్రం పండుగను జరుపుకోవాలని గ్రామస్తులు ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 27 నుంచి నిర్వహించనున్న మొహర్రం పండుగను ప్రతిఒక్కరూ సామరస్యంగా నిర్వహించుకోవాలని గ్రామపెద్దలు తీర్మానించారు. స్నేహపూర్వక వాతావరణంలో పండుగ జరుపుకోవాలని గ్రామస్తులు కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ రూకేష్ రెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవన్న, చిల్క చిన్నన్న, కొప్పుల దేవన్న, గ్రామస్తులు పాల్గొన్నారు

ఆలయంలో వసతులు కరువు



ఆలయ ప్రాంగణంలో తిరుగుతున్న పశువులు

జైనథ్: ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాముఖ్య పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో కనీస వసతులు కరువయ్యాయి. దేవాదాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో ఆలయ ప్రాంగణంలో విచ్చలవిడిగా పశువులు, వీధి శునకాలు తిరుగుతున్నప్పటికీ ఆలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆలయానికి వచ్చిన భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయం నుంచి వచ్చే ఆదాయాన్ని చూస్తున్నారు కానీ.. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు రాలేకపోతున్నారు. మౌలిక వసతులు కల్పించడంలో పాలకవర్గం విఫలమయ్యారు. కనీసం మరుగుదొడ్లు సైతం శుభ్రపరచాలని భక్తులు కోరుతున్నారు.

తవ్వారు.. రోడ్డుపై పోశారు



సాత్నాల: అసలే సింగల్ రోడ్డు, ఆపై మూల మలుపు, మిషన్ భగీరథ వాటర్ కోసం రోడ్డు పక్కన గుంత తవ్వి, ఆ మట్టిని రోడ్డుపైనే వేశారు. భోరజ్ మండలంలోని సిర్సన, గూడా, రాంపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం



సాత్నాల: భోరజ్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ భవనం పగుళ్లు తేలాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో అని బిక్కు బిక్కుమంటూ పిల్లలు భయపడుతున్నారు. భవనం పెచ్చులూడి పిల్లల మీద పడి ప్రమాదం జరగక ముందే, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నెరవేరనున్న సొంతింటి కల

- పైలెట్ ప్రాజెక్ట్‌గా రిమ్మ గ్రామం ఎంపిక
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



తిమ్మాపూర్‌లో బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇల్లు

సిరికొండ: ప్రతీ మనిషికి సొంతిల్లు ఉండాలని కల కంటాడు. ఆ కల మాత్రం పేదవారికి కలగానే మిగిలిపోతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పేదని కలను సకారం చేయాలని శ్రీకారం చుట్టింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5 లక్షలు రుపాయాలతో పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తోంది. దీంతో పేదల సొంతింటి కల సహకారమవుతున్న వేళ, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద రిమ్మ ఎంపిక..

ఇందిరమ్మ ఇళ్ల మంజురులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీని ఎంపిక చేసింది. దీంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను ఎంపిక చేసి రిమ్మ 153 ఇళ్లను మంజూరు చేసింది. 153 ఇళ్లను రిమ్మ గ్రామంతో పాటు రిమ్మ పరిధిలోని రాజంపేట్, తిమ్మాపూర్ గ్రామాల్లోని లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు వారికి ఉన్న గుడిసెలు తొలగించి వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 20 ఇండ్లు స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయ్యాయి. 92 ఇండ్లు బేస్‌మెంట్ లెవెల్‌కి వచ్చాయి. మిగతావి రూఫ్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా నిర్మాణం మొదలు పెట్టారు. బేస్‌మెంట్ లెవెల్ వచ్చిన లబ్ధిదారులకు అధికారులు ఫొటో తీసిన తరువాత వారంలో బిల్లు జమ అవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 57 మందికి రూ.1 లక్ష రుపాయాలు చొప్పున మొదటి విడతలో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

రెండవ విడతలో..

మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు కూడా దాదాపుగా జమ కావడం జరిగింది. రెండో విడతలో మండలంలో బోథ్ నియోజకవర్గంలోని 147, ఖానాపూర్ నియోజకవర్గంలో 37, మొత్తం 184 ఇండ్లు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఎంపిక కూడా పూర్తయి, ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభించారు. మరిన్ని గ్రామాల్లోని నిరుపేదలకు ఇళ్లు మంజురు చేయాలని నిరుపేదలు కోరుతున్నారు.

గుడిసెలో ఉండేవాళ్లం



మాకు ఇల్లు లేక పూరి గుడిసెలో ఉండేవాళ్లం. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషపడ్డాం. ఇంటి నిర్మాణం ప్రారంభించాం. లక్ష రుపాయాలు ఖాతాలో జమ అయింది. ప్రస్తుతం డోర్ లెవెల్‌లో నిర్మాణం పూర్తయింది.

– ఆత్రం జారుబాయి, రిమ్మ

డబ్బు జమ కాలేదు



నాకు ఇల్లు మంజూరైంది. ఇల్లు నిర్మాణం మొదలుపెట్టి, బెస్‌మెంట్ లెవెల్ వరకు పూర్తయింది. పంచాయతీ కార్యదర్శి ఫొటో తీసుకున్నాడు. కానీ ఇంకా డబ్బులు జమ కాలేదు. త్వరగా డబ్బులు జమ అయితే నిర్మాణం పూర్తి చేస్తాం.

– పెందుర్ శకుంతల, రిమ్మ

వేగంగా పనులు



ఇందిరమ్మ పథకంలో మొదటి విడతలో రిమ్మ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, అర్హులకు ఇళ్లు మంజూరు చేశాం. గ్రామంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణం జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– రవీందర్, ఎంపీడీవో, సిరికొండ

రైతు భరోసా డబ్బులు రైతులకు ఇవ్వాలి

నేరడిగొండ: వానాకాలం పంటలకు పెట్టుబడికి రాష్ట్ర ప్రభుత్వం రైతుల అకౌంట్‌లలో వేసిన రైతు భరోసా డబ్బులు బ్యాంకులు రైతులకు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకుడు సాబ్లే సంతోష్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతు రుణమాఫీ కానీ రైతుల అకౌంట్లలో పడిన రైతు భరోసా డబ్బులను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టి ఆ డబ్బులను రైతులు తీసుకోకుండా అడ్డుకోవడాన్ని ఖండించారు. ముందే రుణమాఫీ కాక నష్టపోయిన రైతులు ఇప్పుడు పెట్టుబడి సహాయం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా డబ్బులు రైతులకు అందేలా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసి చర్యలు చేపట్టాలని సూచించారు.

సెక్టోరియల్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సెక్టోరియల్ అధికారిగా నియామకమైన ఉష్కం తిరుపతిని స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడుగు మహేందర్, చందన్ బాబు, ప్రశాంత్, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.